ప్రభాత
కడప-అన్నమయ్య
తెలుగు వాణిజ్య దినపత్రిక
వార్త
సోమవారం 16 ఫిబ్రవరి 2026

## కుక్కల దాడిలో చుక్కల జింక మృతి

చౌడేపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

కుక్కల దాడిలో చుక్కల జింక మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని దిగువపల్లి పంచాయతీ కొలింపల్లికి సమీపంలో బోయకొండ అటవీ ప్రాంతముంది. గ్రామంలో తెల్లవారు జామున కుక్కల అరుపులు వినిపించడంతో చుట్టుపక్కల వారు వెళ్ళి చూడగా వాటి మధ్యలో చుక్కల జింక మృత్యువుతో పోరాడుతోంది. వెంటనే గ్రామస్తులు కుక్కల గుంపును తరిమేశారు. అయితే అప్పటికే చుక్కల జింక మృతి చెందింది. ఈ విషయాన్ని ఫారెస్టు అధికారులకు సమాచామందించారు. బోయకొండ బీట్ ఆఫీసర్ రాము సంఘటనా స్థలానికి వచ్చి పశువైద్యాధికారి సూచనల మేరకు అసిస్టెంట్ గోవర్ధన్ జింకకు పోస్టు మార్టం నిర్వహించి, అటవీ ప్రాంతానికి సమీపంలో కాల్చేసి భూమిలో ఖననం చేసారు. తరచూ అడవి జంతువులు కుక్కల బారిన పడి మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తులంటున్నారు.



మృతి చెందిన చుక్కల జింక

## శిల్పారామంలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

### ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శనలు

పులివెందుల, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :

మహాశివరాత్రి సందర్భంగా పులివెందుల స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రాంగణం అంతా పిల్లలు, పెద్దల సందడితో కళకళలాడింది. డ్యాన్స్ మాస్టర్ భవాని కృష్ణ క్లాసికల్ డాన్స్, పులివెందుల వారి శిక్షణలో చిన్నారులు అందించిన నృత్య ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. శ్రీ గణేశాయ ధీమహి, ఓం నమః శివాయ, అఖిలాండేశ్వరి, ఐగిరి నందిని, భరత వేదమున, శివతాండవం తదితర భక్తి గీతాలకు చిన్నారులు భావప్రధానంగా నృత్యాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రేక్షకులు చిన్నారుల ప్రతిభను కరతాళధ్వనులతో అభినందించి ప్రోత్సహించా రు. కార్యక్రమ ఏర్పాట్లను శిల్పారామం ఏఓ టి. విశ్వనాథరెడ్డి పర్యవేక్షించగా, ఫీల్డ్ సూపర్వైజర్ సుబ్బారావు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. మహాశివరాత్రి వేడుకల సందర్భంగా నిర్వహించిన ఈ సాంస్కృతిక కార్యక్రమం భక్తి, సాంప్రదాయం, సాంస్కృతిక విలువలను ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది.



# అనంతపురం గంగమ్మ తల్లి జాతర ఏర్పాట్లును పరిశీలించిన మంత్రి

### జాతరకు వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలని నాయకులను, అధికారులను ఆదేశించిన మంత్రి



మంత్రికి ఘన స్వాగతం పలుకుతున్న ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

మండలంలోని అనంతపురం గ్రామ పంచాయతీలో వెలసిన శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లిని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి కి ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు, ఆలయ చైర్మన్ వెంకటేశ్వరయ్య, ఆలయ ఈవో శ్రీనివాసులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఫిబ్రవరి 18, 19 తేదీలలో అనంతపురం శ్రీ గంగమ్మ జాతర జరగనుంది. జాతర సందర్భంగా వివిధ శాఖల అధికారులతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతర ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు, మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత జిల్లా స్థాయి అధికారులను మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. గంగమ్మ జాతర నిర్వహణపై మీడియాతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 18,19 తేదీలలో జరిగే అనంతపురం గంగమ్మ జాతరను కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఏడాది జాతరలో దుకాణాలు ఏర్పాటు చేసే వారి సౌకర్యార్థాన్ని దృష్టిలో ఉంచుకొని గేటు వసూలను రద్దు చేయడం జరిగిందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా ఈ ఏడాది మహిళా భక్తులకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామన్నారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని కడప, అన్నమయ్య జిల్లాల నుంచి గంగమ్మ జాతరకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను నడుపుతున్నామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. భక్తులను దృష్టిలో ఉంచుకొని అందరికీ అమ్మవారి దర్శనం కల్పిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారి ప్రసాదాలను అందజేస్తామని చెప్పారు. జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. గంగమ్మ జాతర విజయవంతం కోసం అధికారులు సహకరించాలని మంత్రి రాంపసాద్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, అటవీ శాఖా డైరెక్టర్ రెడ్డెయ్య యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు మదన్ మోహన్, రాయచోటి మార్కెట్ చైర్మెన్ అనుంపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లి మార్కెట్ చైర్మన్ షఫీ నాయక్, మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, రామాపురం మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకట్రామ రాజు, మండల శాఖా అధికారులు, ఆలయ పూజారులు ఆదిమూలం వంశీయులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు, పాల్గొన్నారు.

## భక్తజనంతో పోటెత్తిన పొలతల క్షేత్రం

### - హర హర శంభోశంకర అంటూ మారుమోగిన పొలతల క్షేత్రం





పెండ్లిమర్రి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

మండలంలోని గంగనపల్లి పంచాయతీలో వెలసిన శ్రీమల్లేశ్వర స్వామి పొలతల క్షేత్రం ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా భక్తజనంతో పోటెత్తింది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో ప్రజలు మల్లేశ్వర స్వామిని క్యూలైన్లలో వెళ్లి దర్శించుకొని హర హర శంభోశంకర అంటూ ప్రత్యేక పూజలు వైభవంగా జరిపి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ప్రాంగణమంతా భక్తజనంతో కిక్కిరిసింది.

**వైభవంగా కల్యాణోత్సవం :** మల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో వారికి ఘనంగా తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. అదిక సంఖ్యలో ప్రజలు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. ఆలయ ఛైర్మన్ రాజారెడ్డి, ఈవో కృష్ణానాయక్, టీడీపీ నాయకులు, ఆర్డీవో జాన్ ఇర్విన్, డీఎంహెచ్ఓ నాగరాజు, తహసీల్దార్ అనురాధ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి, అధికారులు, అధిక సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు.

**అక్కదేవతల వద్ద :** అక్కదేవతల ఆలయం వద్ద అమ్మవారిని మహిళా భక్తులు వరపడి తమ మొక్కులు చెల్లించుకున్నారు. చెట్టుకు ఊయలలు కట్టి తమకు సంతానప్రాప్తి కలగాలని వేడుకున్నారు. బండెన్న, పుట్టాంజనేయస్వామి, కాశినాయన స్వామి వార్లకు పూజలు చేశారు. అలాగే కాశినాయన ఆశ్రమంలో భక్తులకు భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**వైద్యశిబిరం :** పొలతల మల్లేరస్వామి ఆలయం ప్రాంగణంలో భక్తులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. డా.ప్రసాద్, సిబ్బంది భక్తులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేయడం జరిగింది. ఈ వైద్యశిబిరానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై వైద్య చికిత్సలు చేయించుకున్నారు.

**వైభవంగా స్వామి వారి ఊరేగింపు :** మల్లేశ్వర స్వామి ఆలయం నుంచి అక్కదేవతల గుడి వరకు స్వామి వారిని డప్పు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. ఆ ఊరేగింపులో ఎలాంటి అవంతరాలు, ట్రాఫిక్ సమస్య లేకుండా జిల్లా ఎస్పీ ఆదేశాలతో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ చల్లని దొర, ఎస్సై తులసీనాగప్రసాద్‌లు తమ సిబ్బందితో పటిష్టబందోబస్తు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

**పారిశుద్ధ్యం :** భక్తులకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య చర్యలను మున్సిపల్ కార్మికులు పారిశుద్య చర్యలు చేపట్టారు.





శివోహం ... శివోహం ...

## శివనామస్మరణతో మార్మోగిన కొండలు, కోనలు

### అత్తిరాలకు పోటెత్తిన భక్తజనం... భక్తకన్నప్ప జన్మస్థలిలో ఆదిదంపతుల కళ్యాణం

రాజంపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

శివరాత్రి పర్వదినంతో శివ క్షేత్రాలు పంచాక్షరి మంత్రంతో మారుమోగాయి. కొండలు, కోనలు శివనామస్మరణతో హోరెత్తాయి. ఆదివారం శివరాత్రి వేడుకలు ఊరు వాడ వైభవంగా జరిగాయి. శివాలయాలు భక్తులతో క్రిక్కిరిసాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం అత్తిరాలలో భక్తులు పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చారు. సాధారణ భక్తులు గంటలు తరబడి స్వామి దర్శనం కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి భక్తులకు ఏర్పడింది. గంటల తరబడి క్యూలో వేచి ఉండడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయానికి విఐపి తాకిడి ఎక్కువైంది. ఈ విషయం తెలుసుకొని తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ జగన్మోహన్ రాజు స్వయంగా భక్తుల వద్దకు వెళ్లి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆలయ ఈవో సురేష్ ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోలీసులతో మాట్లాడి క్యూలు త్వరగా కదిలేలా చేశారు. ఆయనకు ఆలయ అధికారులు, పాలకవర్గం పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, రాజంపేట మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి స్వామినీ దర్శించుకున్నారు. పవిత్ర అత్తిరాల మడుగులో వేలాదిమంది భక్తులు స్థానాలు ఆచరించారు. మరోవైపు శివ భక్తుడు భక్తకన్నప్ప జన్మస్థలి ఊటుకూరులో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి శివరాత్రి సందర్భంగా ఆలయంలో ఆదిదంపతుల కళ్యాణం వైభవంగా జరిగింది .శివపార్వతుల కళ్యాణ వేడుకలకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది. ఉట్కూరు శివాలయంలో నాగలింగేశ్వర స్వామినీ ఆలయ అర్చకులు ఓంకారేశ్వరునిగా అలంకరించారు. మరోవైపు రాజంపేట పట్టణంలో శివాలయంలో స్వామిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. గుండ్లూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయం, మందపల్లి పాలేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి.



భక్తులతో మాట్లాడుతున్న జగన్ మోహన్ రాజు

### లంకమల్ల శ్రీరామలింగేశ్వర

## స్వామిని దర్శించిన కలెక్టర్

బద్వేలు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ బద్వేల్ మండలంలోని లంకమల్ల శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంను దర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ. చంద్ర మోహన్, ఎండోమెంట్స్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



### హరహర నామ స్మరణతో

## మార్మోగిన శైవాలయాలు

పీలేరు ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శైవాలయాలు హర హర నామ స్మరణతో మార్మోగాయి. పీలేరు పట్టణంలోని శ్రీ కాశీ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం, దొడ్డిపల్లి పంచాయతీ, శివరామపురం గ్రామం, గార్గేయ నది ఒడ్డున వెలసిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం, తలుపుల పంచాయితీ, అడవిపల్లి అటవీ ప్రాంతంలోని శ్రీమద్గుండాల మల్లేశ్వర స్వామి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లోని శైవ క్షేత్రాలన్నీ భక్తులతో కళకళలాడాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని తమ మొక్కులు తీర్చుకోవడం ఆరంభించారు. ఆలయాల్లో అర్చకులు రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకారం, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం, శివ పార్వతుల కళ్యాణోత్సవాలు, పాలాభిషేకాలు నిర్వహించారు. దాతలు భక్తులకు అన్న ప్రసాదాల వితరణలు చేపట్టారు. శివరాత్రి సందర్భంగా ఆలయాలను పూలు, విద్యుత్ దీపాలతో చక్కగా అలంకరించారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు తగిన ఏర్పాట్లు చేశారు. అదేవిధంగా స్వామి వార్ల దర్శన కార్యక్రమానంతరం భక్తులకు తీర్థ, ప్రసాదాల వితరణ జరిగింది. పీలేరు సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్సై, పోలీసు సిబ్బంది ఆలయాల పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయాలకు వెళ్లే భక్తులకు సౌకర్యంగా పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ ఎండి రోషన్ ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. శివ భక్తులందరూ రాత్రి జాగరణకు సంసిద్ధులయ్యారు.





# శ్రీ వీరభద్ర స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన :మంత్రి





రాయచోటి ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

పట్టణంలోని మాండవ్య నది ఒడ్డున వెలసిన అత్యంత ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామివార్లకు ఈరోజు ఉదయం పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి. స్వామివార్ల బ్రహ్మోత్సవాలల్లో భాగంగా మూడవరోజు పాల్గొన్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి కి ఆలయ అర్చకులు,ఆలయ పర్యవేక్షణ అధికారి డివి రమణారెడ్డి ,కమిటీ చైర్మన్ తిరుమల మనోజ్ కుమార్,కార్యవర్గ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం ఆయనందీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మేళా తాళాలతో ఊరేగింపుగా స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి వేద పండితుల మంత్రోచ్చనాలతో పూజలు నిర్వహించడం జరిగినది.అర్చక స్వాములకు రుత్వికులకు బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ రోజు ఘనంగా ఉత్సవాలు జరిగాయన్నారు. హిందూ ధర్మ సంరక్షణ కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఆయన తెలిపారు. రేపటి వారం నుంచి రాష్ట్రంలో దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గాజుల ఖాదర్బాషా, బోనుముల ఖాదరవల్లి, అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు గండికోట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాయచోటి వీధుల్లో పోలీసుల కవాతు

రాయచోటి టౌన్ ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

అన్నమయ్య జిల్లా పోలీసు యంత్రాంగం ప్రజల భద్రత కోసం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని చాటిచెబుతూ, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాల మేరకు, శనివారం రాయచోటి పట్టణంలో పోలీసులు మార్చ్ పాస్ట్ (కవాతు) నిర్వహించారు. పోలీసింగ్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం పట్టణ ప్రజల్లో ధైర్యాన్ని, భద్రతా భావాన్ని నింపింది. కవాతు సాగిన మార్గం రాయచోటి పట్టణ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ పోలీసు బలగాల కవాతు, ప్రధాన కూడళ్ల గుండా సాగింది. శ్రీ వీరభద్ర స్వామి ఆలయం ప్రధాన మార్కెట్ ప్రాంతంఠాణా సర్కిల్ రవి థియేటర్ సెంటర్ బంగ్లా సర్కిల్ శివాలయం చెక్ పోస్ట్ ఆర్టీసీ బస్టాండ్ మీదుగా తిరిగి పోలీస్ స్టేషన్ వరకు కవాతు నిర్వహించారు.ఈ సందర్భంగా రాయచోటి పట్టణ సీఐ బి.వి. చలపతి మాట్లాడుతూ, ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు విష్ణువర్ధన్, జహీర్, సిబ్బంది సాయుధ బలగాలు పాల్గొన్నారు.



# వీర బ్రహ్మ నామస్మరణతో మారుమోగిన మఠం..

బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

భూత భవిష్యత్ వర్తమాన కాల జ్ఞానాన్నీ రచించిన జగద్గురు శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంలో ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో మఠాధిపతి శ్రీ వీర దర్మజ వెంకటాద్రి స్వామి దంపతులు నిర్వహించారని మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా బ్రహ్మం గారి కళ్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ కళ్యాణ మహోత్సవం మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి ధర్మపత్ని ఉమాదేవి వారి ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్స్నవ ను వేదమంత్రాల మధ్య పురోహితులు నిర్వహించారు.కందిమల్లాయపల్లె పుర ప్రజలు భక్తులు పాతూరు రచ్చబండ నుంచి బ్రహ్మం గారి కళ్యాణం కు పట్టు వస్త్రాలు తీసుకొని వచ్చారు. అలాగే దేవాదాయ శాఖ తరుపున కదిరి లక్ష్మి ృ నరసింహా స్వామీ కార్యనిర్వహణాధికారి వెండి దండి శ్రీనివాసులరెడ్డి తీసుకొని వచ్చారు. భక్తులు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు చర్యలు మేనేజర్ ఈశ్వరయ్య చారి తీసుకొన్నారు. సబ్ ఇన్స్పెక్టర్ శివ ప్రసాద్ ఆధ్వర్యంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నారు.





# ఫ్లూ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

సదుం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

ఫ్లూ జ్వరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ప్రవీణ్ అన్నారు. ఆదివారం సదుం మండలంలోని కంభం వారి పల్లి, అమ్మగారి పల్లి, పుట్టావారి పల్లి గ్రామాల్లో పర్యటించి అక్కడ గల కోళ్ల ఫారాలను రాష్ట్ర ఎస్. సి. డి. సి. కన్సల్టెంట్ డాక్టర్ ఆర్తి నరేదా, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్, డి. ఎమ్. హెచ్. ఓ. డాక్టర్ లక్ష్మీనరసయ్య, జిల్లా సర్వలెన్స్ అధికారి డాక్టర్ శ్రీధర్ తో కలసి తనిఖీ చేశారు. ఇటీవల బర్డ్ ఫ్లూ తో కోళ్ల చనిపోవడం తో సదుం మండలం లోని బర్డ్ ఫ్లూ ప్రభావిత కోళ్ల ఫారాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చనిపోయిన కోళ్లను ఎస్. ఓ. పీ ప్రకారం ఖననం చేసిన పద్ధతి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ వైద్య ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖలు చేపట్టిన నివారణ, నియంత్రణ చర్యలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్త చేశారు. మరియు ఆ గ్రామ ప్రజలకు బర్డ్ ఫ్లూ జ్వరాలపై తీసుకోవలసిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. ముఖ్యంగా పౌల్ట్రీ ఫారాలు ఉన్న ఏరియా నుండి 3కి. మీ పరిధిలో ఉన్న గ్రామాల్లో ఇంటింటికి ఆరోగ్య సిబ్బంది వెళ్లి ఎవరికైనా జ్వరాలు, దగ్గు, జలుబు, గొంతునొప్పి,శరీర నొప్పులు ఉన్నాయో గుర్తించి రెఫర్ చేయడం చేయాలని మరియు ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యంగా చేతుల శుభ్రత పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఆహార పదార్థాలను వేడిగా తినాలని, మాస్కులు ధరించాలని . కోళ్ల ఉత్పత్తులను బాగా ఉడికించి తినాలని లేక నెల రోజులు తినకుండా ఉండాలని అన్నారు. రోగం వచ్చి చనిపోయినకోళ్లను



చాలా లోతుగా మట్టిలో పూడ్చి పెట్టాలని అన్నారు. ఇప్పటికే కోళ్ల ఫారాలు పూర్తిగా మూసివేయడం జరిగిందని అన్నారు. అనుమానిత లక్షణాలు కనిపించడం జరిగితే వారి నుండి స్వాబ్ నమూనాలు సేకరించి ల్యాబ్ కు పంపడం జరుగుతుంది అన్నారు. వారిని వేరే గదిలో ఉంచాలన్నారు. లేక ఉన్నత అస్పటల్ కు రెఫెర్ చేయడం జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమం లో సదుం మండలం పశు సంవర్ధక వైద్యులు డాక్టర్ ముని చంద్ర రెడ్డి, చెరుకు వారి పల్లి వైద్యులు డాక్టర్ చరణ్, చిత్తూరు జిల్లా ఏపిడేమోలోజిస్ట్ శ్రీవాని, డిప్యూటీ హెచ్. ఈ. ఓ. మహమ్మద్ రఫీ, పర్యవేక్షకులు నాగరాజు, నీలకంఠ, షికామని, మరియు పీ. హెచ్. సి. సిబ్బంది, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## హత్యకేసులో నిందితుడు అరెస్ట్



ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణంలోని 3టౌన్ పీఎస్ పరిధిలో ఈ నెల 13వ తేదీ రాత్రి నాగులకట్ట వీధిలో కురాకు వినయ్ తన నివాసంలో రాయచోటికి చెందిన గువ్వల సుబ్రమణ్యంను(33) కత్తితో గొంతు భాగంలో పొడిచి హత్య చేశాడు. మృతుని భార్య ముద్దాయిని గువ్వల రమా అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు ఐదు రోజుల క్రితం ఇద్దరూ కలిసి మద్యం సేవించిన సమయంలో జరిగిన గొడవలో మృతుడు నిందితుడిని కొట్టిన విషయంపై పగ పెంచుకొని ఈ హత్యకు పాల్పడినట్లు తేలింది. నిందితుడు వినయ్‌ను ఆదివారం మధ్యాహ్నం జమ్మలమడుగు రోడ్డు బొల్లవరం బస్ షెల్టర్ వద్ద పోలీసులు అరెస్టు చేయడం చేసి అతని వద్ద మత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్సై సంజీవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## యువకులు క్రీడల్లో రాణించాలి : మంత్రి




రాయచోటి ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

యువకులు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన ఈరోజు రాయచోటి ప్రీమియర్ క్రికెట్ లీగ్-2026 గ్రాండ్ ఫైనల్స్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో రాష్ట్రంలోనే ప్రభుత్వం యువతకు క్రీడలల్లో విస్తృత అవకాశాలు కల్పిస్తోందని, ఆంధ్రప్రదేశ్‌లో ఈ-స్పోర్ట్స్ అభివృద్ధికి దీర్ఘకాలిక దృష్టితో కార్యాచరణ ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో గత 30 రోజులుగా జరిగిన రాయచోటి క్రికెట్ ప్రీమియర్ లీగ్2026 ఫైనల్స్ లో ముఖ్యఅతిథిగా పాల్గొని ఫైనల్లో గెలిచిన జట్టుకు బహుమతులు మరియు ట్రోఫీ ఆయన అందజేశారు. యువకులకు క్రీడలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు బొనమల ఖాదరవల్లి మరియు మున్సిపల్ కౌన్సిలర్ పాపిరెడ్డి మదన్మోహన్ రెడ్డి, కొలిమి హరున్ భాష మరియు టిడిపి నాయకులు నాగిరెడ్డి, మైనద్దీన్, హాజీ, మస్తాన్, ప్రభాకర్, నాసర్, ఈవెంట్ ఆర్గనైజర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా శివరాత్రి

నందలూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నందలూరు ఉల్లంగేశ్వర స్వామి ఆలయం, అర్ధనారీశ్వర స్వామి ఆలయం, కన్యాశ్రమం శివాలయం, చింతకాయ పల్లి లోని కామాక్షి సమేత బోల మల్లేశ్వరస్వామి ఆలయం, పొత్తపిలోని మూల స్థానేశ్వర స్వామి ఆలయం, లేబాక శివాలయం, నారాయణరాజుపేట శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ పలు దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రత్యేక అలంకరణలో మహాశివుడు.

తంబళ్లపల్లె ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్య కొండలో మహాశివరాత్రికి స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కొండ కింద నుండి పైకి 37ఆర్టీసీ బస్ సర్వీసులు, మదనపల్లి, ములకలచెరువు, పెద్దమండెం, బి కొత్తకోట నుండి బస్ సర్వీసులు నడిచాయి. మలికి మధుసూదన్ రెడ్డి ఉచిత బస్సు సర్వీస్ లుఏర్పాటు చేశారు. కొండపై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై అనిల్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఈవో మునిరాజా సారథంలో భక్తులకు క్యూలైన్లు, దర్శనం, ఆలయంలో అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామి స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలి రావడంతో మల్లయ్య కొండ కిటకిటలాడింది. మల్లయ్య కొండకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి శంకర్ యాదవ్, బిజెపి సీనియర్ నాయకుడు చల్లపల్లి నరసింహారెడ్డి, టిడిపి తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు, సీడ్ మల్లికార్జున నాయుడు, పలువురు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.

## భాజపా మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా లక్ష్మీదేవి

ఖాజీపేట, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా కడప జిల్లా అధ్యక్షులుగా ఎన్.లక్ష్మీదేవి ఆదివారం నియమితులు అయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ నాకు బాధ్యతలు అప్పజెప్పిన బిజెపి కడప జిల్లా అధ్యక్షులు శ్రీ జంగిటి వెంకటసుబ్బారెడ్డి కి మరియు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ కి, ఆరోగ్యశాఖ మంత్రివర్యులు శ్రీ.సత్య కుమార్ యాదవ్ కు, శాసన సభ్యులు ఆదినారాయణ రెడ్డికి, ఎంపీ సీఎం రమేష్, శశి భూషణ్ రెడ్డిలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. నా మీద నమ్మకంతో నాకు బాధ్యతలు అప్పజెప్పిన జంగిటి వెంకటసుబ్బారెడ్డి గారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నేను బాధ్యతగా వ్యవహరిస్తానని అలాగే బిజెపి పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తానని కడప జిల్లాలో బిజెపి పార్టీ బలపడే దానికి మహిళల్లో చైతన్యం చేస్తానని నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని మహిళా సమస్యలకు ముందుండి మహిళా సమస్యలు పరిష్కారానికి నేను కృషి చేస్తానని తెలిపారు.

## పనిచేయని సర్వర్...

### ముందుకు సాగని కుటుంబ సర్వే

దువ్వూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల సిబ్బందికి కుటుంబ సర్వే చేయవలసిందిగా ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది కుటుంబ సర్వేలను మొదలుపెట్టారు. ప్రతి రోజు ఉదయం పూట కుటుంబ సర్వే చేస్తుండగా సర్వర్ సక్రమంగా పనిచేయక పోవడంతో సచివాలయ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే ప్రారంభించి 15రోజులు అయినా కుటుంబ సర్వే ముందుకు సాగడం లేదు. ఈనెల చివరిలోగా కుటుంబ సర్వే పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే సర్వర్ పని చేయకపోవడంతో సర్వేను ముందుకు తీసుకు వెళ్లలేక పోతున్నారు. కుటుంబంలోని సభ్యుల వివరాలు, వారి ఇల్లు, వారికి ఎటువంటి సౌకర్యాలు ఉన్నాయి వాటిని పూర్తిగా నమోదు చేయవలసి ఉంది. కుటుంబానికి సంబంధించిన సగం వివరాలను సేకరించిన తర్వాత సర్వర్ పనిచేయడం లేదు. దీంతో తిరిగి మొదటి నుంచి చేయవలసి వస్తుందని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. ప్రతిరోజు రెండు, మూడు కుటుంబాలు కూడా చేయలేకపోతున్నారు. దీంతో సర్వర్ నాణ్యతగా ఉంటే సర్వే పూర్తిచేసే అవకాశాలు ఉన్నాయి. కుటుంబ సర్వే సక్రమంగా చేయడం లేదని సచివాలయ సిబ్బంది పై అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. అయితే ఇక్కడ సర్వర్ పనిచేయ కపోవడంతోనే తాము సర్వే పనులు పూర్తి చేయలేక పోతున్నామని, సర్వర్ యొక్క పటిష్టతను పెంచితే సర్వే పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## వ్యవసాయ భూములలో వ్యవసాయమే చేయాలి

### పొలాలను ప్లాట్లుగా మారిస్తే శిక్ష తప్పదు : తాసిల్దార్

పీలేరు ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:



పీలేరు మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఉన్న వ్యవసాయ భూములను వ్యవసాయానికి ఉపయోగించాలని అలా కాకుండా ప్రభుత్వం అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా ఇండ్లు స్థలాలుగా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ శివకుమార్ అన్నారు .ఆయన ఆదివారం ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఇప్పటికే మండల పరిధిలోని అన్ని గ్రామాలలో అధికారుల పర్యవేక్షణలో డికెటి భూములు అక్రమమునకు గురి కాకుండా చేస్తున్నామని ప్రభుత్వ అధికారుల మాటలను లెక్కచేయకుండా ఎవరైనా అక్రమ మార్గాలలో ప్రభుత్వ భూమిని అక్రమిస్తే క్రిమినల్ కేసుల నమోదు చేసేందుకు కూడా వెనుకాడ బొమ్మని ఆయన హెచ్చరించారు.

### ఉప కార్మిక కమిషన్ సంయుక్త సమావేశానికి ఉత్తర్వులు జారీ

పీలేరు ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:



పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యాశాలలో ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్న ఫిర్యాదుపై స్పందించి సంయుక్త సమావేశానికి హాజరు కావాలని తిరుపతి ఉప కార్మిక శాఖ కమిషన్ వారు జారీ చేసిన ఉత్తర్వులను పీలేరు కార్మిక శాఖ అధికారి జారీ చేశారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యాశాలలో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు, అదే విధముగా సెక్యూరిటీ గార్డ్ సిబ్బందికి, ఏజెన్సీ కాంట్రాక్టర్ల చేత పెరిగిన జీతాలు, పీ.ఎఫ్. బకాయి డబ్బులు, ఈఎస్ఐ కార్డుల, పంపిణీ కార్మిక చట్ట ప్రకారం సెలవుల మంజూరులో ఆసుపత్రి అధికారులు మరియు ఏజెన్సీ కాంట్రాక్టర్ల నిరక్ష్యంపై 2026 ఫిబ్రవరి 5న ఉప కార్మిక కమిషన్ తిరుపతి, మరియు సహాయ కార్మిక కమిషన్ మదనపల్లి, వారికి ఫిర్యాదు చేయడం జరిగిందని ఫిర్యాదుపై స్పందించిన తిరుపతి ఉప కార్మిక కమిషనర్ యన్. సురేష్ కుమార్ ఈ నెల ఫిబ్రవరి 17వ తేది మంగళవారం ఉదయం 11 గంటలకు ఉప కార్మిక కమిషనర్ కార్యాలయంలో జరుగు సంయుక్త సమావేశానికి ఆసుపత్రి పర్యవేక్షణ అధికారికి మరియు పారిశుధ్య కార్మికుల ఏజెన్సీ చైతన్య జ్యోతి సోషల్ వెల్ఫేర్ సొసైటీ, సెక్యూరిటీ గార్డ్ సిబ్బంది ఏజెన్సీ ఈగల్ హంటర్ సొల్యూషన్ లిమిటెడ్, నిర్వాహకులకు సంబంధిత నిఘంటువులతో హాజరు కావాలని ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని వీరు తెలిపారు కార్యక్రమంలో పీలేరు కాంగ్రెస్ మండల అధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్, మద్దెల వినోద్ కుమార్ పాల్గొన్నారు.

# వివాహిత మహిళ అదృశ్యం

దువ్వూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

మండలంలోని కానగూడురుకు చెందిన వివాహిత మహిళ అదృశమైనట్లు దువ్వూరు పోలీసులు తెలిపారు. ఈమెకు 10 సంవత్సరాల క్రితం వివాహమైందని ఇద్దరు పిల్లలు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీన కానగూడూరు నుండి దువ్వూరులోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న తన అక్క చాంద్ బి ఇంటికి వచ్చి అక్కడి నుండి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. బంధువులు పలుచోట్ల వెతికి ఎక్కడ కనబడక పోవడంతో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## కొనగవేశ్వర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు

### బండలాగుడు పోటీలకు శ్రీకారం చుట్టిన బిటెక్



పులివెందుల, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పులివెందుల మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొనగవేశ్వర స్వామి ఆలయంలో టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆయన మొక్కుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ నెలకొని, శివనామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అనంతరం పుష్పగిరి పాఠశాల కరస్పాండెంట్ ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను బీటెక్ రవి ప్రారంభించారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం ఆనందంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాలు సంప్రదాయా లకు చిహ్నమని ఆయన పేర్కొన్నారు. క్షేత్రం వద్ద వాలంటీర్‌లు విధులు నిర్వహిస్తున్న విద్యార్థులను బిటెక్ రవి అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి, హజ్ హౌస్ డైరెక్టర్ మహబూబ్ బాషా, నల్లాగారి భాస్కర్ రెడ్డి, పులివెందుల మండల టీడీపీ ఇంచార్జ్ జగన్ మోహన్ రెడ్డి, లోమడ జయకుమార్, గంగాధర్ యాదవ్, కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు రామగంగి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు, క్రీడా అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ వ్యక్తి వ్యక్తి మృతి

యర్రగుంట్ల ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:

యర్రగుంట్ల ఐసీఎల్ సిమెంట్ కర్మాగారం సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రెండు బైకులు ఢీకొన్నాయి. యర్రగుంట్ల నుంచి కదిరే పల్లెకు వెళ్తున్న హేమంత్ కుమార్ మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

## మహాశివుని దర్శించుకున్న దినేష్ రెడ్డి

తంబళ్లపల్లె ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె మల్లయ్య కొండ మహాశివుని రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ తంబళ్లపల్లె అబ్జర్వర్ దినేష్ రెడ్డి ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ఈవో మునిరాజా సాదరంగా ఆహ్వానించి అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామిలు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అయన మల్లయ్య కొండ శివరాత్రి ఉత్సవ నిర్వహణపై ఈఓను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో మల్లయ్య కొండ అభివృద్ధికి కుటుంబ ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఆయన వెంట రాష్ట్ర టిడిపి బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు, రాజంపేట తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, టిడిపి జిల్లా బీసీ నాయకుడు సురేంద్ర, సోమశేఖర్, మీసాల భాస్కర్ నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసమే అసోసియేషన్

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాలలో సుమారు 2500 కుటుంబాలు నిర్మాణ రంగంలో ఐరన్ అల్యూమినియం కు సంబంధించిన పనులు చేస్తున్నారని వారి సమస్యల పరిష్కారం కోసమే ప్రొద్దుటూరు ఏఐజి అండ్ స్టీల్ అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు అధ్యక్షులు అల్యూమినియం దస్తగిరి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పోరపాటు రోడ్డులో ఏఐజి అండ్ అల్యూమినియం అసోసియేషన్ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ జీవన విధానంలో ప్రస్తుతం తాము ఎన్నో సమస్యలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాటి పరిష్కారం కోసం అందరం సంఘటితం కావాలన్న నిర్ణయంతో ఈ అసోసియేషన్ ఏర్పాటూ చేశామన్నారు. ఈ సంఘం ద్వారా ఈ కార్మికుల కుటుంబాల సమస్యలు చేస్తున్న పనులలో సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ అసోసియేషన్లో కార్మికులతో పాటు యజమానులు కూడా ఉన్నారన్నారు. గత కొన్ని ఏళ్లుగా నిర్మాణ రంగంలో తక్కువ ధరలకే చేస్తామంటూ మోసం చేస్తున్న వైనాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన అవసరం మనకు ఉందన్నారు ఈ దిశగా అసోసియేషన్ కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ రఫీ ఉపాధ్యక్షులు విజయ్ కుమార్ షేక్ వలి భాష కార్యదర్శి మాలేపాటి వెంకట శ్రీహరి సహాయ కార్యదర్శి షేక్ సమీర్ కోశాధికారి పఠాన్ ఫర్హాద్ అహ్మద్ మరియు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

## శివాలయాల్లో ప్రత్యేక పూజలు

దువ్వూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఉన్న శివాలయాలలో మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పుల్లారెడ్డిపేట లోని శ్రీ త్రిపిట ఆలయం నందు వెలసి ఉన్న శ్రీ అన్నపూర్ణేశ్వరి సమేత విగ్నేశ్వర స్వామికి అభిషేకాలు, హోమాలు, పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ఆవరణం నందు ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పాత దువ్వూరులో వెలసి ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదాన సౌకర్యం కల్పించారు. గుడిపాడు, నీలాపురం, గోపులాపురంలో ఉన్న శివాలయాల్లో కూడా పూజలు నిర్వహించారు. అన్నిచోట్ల భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

## సంక్షేమం-అభివృద్ధి సమతుల్యత

వైవీయూ, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త:



బడ్జెట్ రాష్ట్ర ఆర్థిక దిశను నిర్ణయించే కీలక ఘట్టంగా నిలుస్తోంది. గత కొన్నేళ్లలో ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొన్న ఒత్తిడుల తరువాత, ప్రభుత్వ ముందున్న ప్రధాన బాధ్యత ఖజానాను స్థిరపరచడం మరియు దీర్ఘకాల వృద్ధికి పునాది వేయడం. పెరిగిన బాధ్యతలు, పరిమిత ఆదాయం, భారీ అప్పుల మధ్య ఈ బడ్జెట్ ఆర్థిక పునర్నిర్మాణానికి ఒక మార్గదర్శకంగా మారే అవకాశముంది. సంక్షేమ వ్యయాల పెరుగుదల - ఆదాయాలపై ఒత్తిడి రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల వ్యయం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా సామాజిక భద్రత పెన్షన్లకే ప్రతి సంవత్సరం సుమారు ..35,000 కోట్ల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి ఉంది. దీనికి తోడు ఇతర పథకాల అమలు ఖర్చులు కలిసివచ్చి ఖజానాపై నిరంతర ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. అదే సమయంలో పెట్టుబడి వ్యయం తక్కువగా ఉండటం వల్ల ఆదాయ వృద్ధి వేగం తగ్గింది. ఆర్థిక శాస్త్ర పరంగా మూలధన వ్యయం పెరిగితేనే భవిష్యత్ ఆదాయ ప్రవాహం పెరుగుతుంది. అందుకే ప్రస్తుత పాలన పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా పన్నుల ఆధారాన్ని విస్తరించడం వైపు దృష్టి సారిస్తోంది. విభజన చట్టంలో ఉన్న హామీల అమలు, అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి వంటి అంశాలకు అవసరమైన నిధులపై ప్రభుత్వం ఆశలు పెట్టుకుంది.

## 2026-27 రాష్ట్రబడ్జెట్ పై ఎమ్మెల్యే సమావేశం



మదనపల్లి ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

ఏపీ ప్రభుత్వం 2026 -27 వార్షిక బడ్జెట్ ను అసెంబ్లీలోప్రవేశ పెట్టింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్2026-27 సంవత్సరానికి రూ.3,32,205 కోట్లతోబడ్జెట్ ప్రతిపాదించారు అని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష తెలిపారు. ఆదివారం మదనపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే షాజహాన్ భాష మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే షాజహాన్ భాష మీడియాతో మాట్లాడుతూ రెవెన్యూ వ్యయం 2,643 కోట్లు, మూలధన వ్యయం రూ.53,915 కోట్లు గా పేర్కొన్నారు. రెవెన్యూ లోటు రూ.22,000 కోట్లు ఉండగా.. ద్రవ్య లోటు రూ.75,868కోట్లు గా వెల్లడించారు. అయితే,,భారీగా కేటాయింపులు చేసారు. పోలవరానికి రూ.6,105 కోట్లు విద్యాశాఖలతో సహా సంక్షేమానికి కేటాయింపుల్లో ప్రాధాన్యత లభించింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ గారు బడ్జెట్ లో పోలవరానికి రూ.6,1 కేటాయింపులు చేస్తున్నరూ అని గౌరవ మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ భాష వెల్లడించారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ ప్లాను యన్లను రాష్ట్రానికి కీలక గ్రోత్ ఇంజిన్లుగా ఇప్పటికే సిద్ధం చేశామని.. విశాఖ, అమరావతి, గుర్తింపు ఇస్తున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగారాయలసీమ రీజియన్ను గ్లోబల్ హార్టికల్చర్ హబ్ గా.మార్చాలని కంకణం కట్టుకున్నామని చెప్పారు. 2030 నాటికి ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని 14.41 లక్షల హెక్టార్లకు పెంచబోతున్నట్లు వెల్లడించారు. రాజధాని అమరావతి తిరుపతి నిర్మాణానికి రూ.6 వేల కోట్లు ప్రతిపాదించారు. విద్యుత్రంగానికి రూ.13,934 కోట్లు, రోడ్లు, పోర్టు, ఎయిర్పోర్టులకు రూ.13,546 కోట్లు, పరిశ్రమలకు రూ.3,161 కోట్లు, సర్దుబాటు నిధి.. రూ.1,500 కోట్లు,వీబీ జీ రామ్ జీకి.. రూ. 8365 కోట్లు, గృహ నిర్మాణరంగానికి రూ.5,451 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవకురూ.4000 కోట్లు, జల్ జీవన్ కు రూ.4,000 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్కు రూ.1,037 కోట్లు, విశాఖ ఆర్థిక ప్రాంతానికి రూ.28,000 కోట్లు ప్రతిపాదించారు. రూ.3.32 లక్షల కోట్ల బడ్జెట్, అదే విధంగా ఎన్టీఆర్ భరోసా రూ.27,719 కోట్లు, దీపం 2.0 రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థికమద్దతు రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి రూ.1,420 కోట్లు, సబ్సిడీ, ఉచిత విద్యుత్ రూ.600 కోట్లు,ఆటో డ్రైవర్ల సేవలో రూ. 450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581కోట్లు, ఉపకారవేతనాలు రూ.3,836 కోట్లు, సమగ్ర శిక్షరూ.2,946 కోట్లు, ఉన్నత విద్య రూ.2,566 కోట్లు,డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం రూ.2,161కోట్లు, మన బడి, మన భవిష్యత్ రూ.1,500 కోట్లు,ఫర్నిపుణ్యాభివృద్ధి రూ. రూ. 1,232 కోట్లు, పీఎం స్కూల్స్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రూ.65 కోట్లు, యువత, క్రీడలురూ.438 కోట్లు, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవ రూ.6,600 కోట్లు, పోలవరం రూ.6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు.మత్స్యకార సేవలో రూ.260కోట్లు, పంటల బీమా250 కోట్లు ఎం కృషి సించాయి యోజన రూ.190కోట్లుగా బడ్జెట్ లో కేటాయింపులు చేసారు అని ఎమ్మెల్యే షాజహాన్ భాష తెలిపారు.

## తనలా ఉన్నవారికి ఉపాధి ఇస్తూ..



**ఒక్క అవకాశమివ్వండి. నా శరీరానికే సమస్య. నా మెదడుకు కాదు.. ఇంటర్వ్యూకు వెళ్లిన ప్రతిసారి అక్కడివారికి దిశా పాండ్యా చెప్పే మాటే ఇది! అయినా 17 తిరస్కరణలు తప్పలేదు. అలాంటి తను ప్రముఖ సంస్థల్లో పనిచేసింది. అథ్లెట్‌గా గుర్తింపు తెచ్చుకుంది. తనలా సమస్య ఉన్నవారికి ఉపాధి అవకాశాలూ చూపిస్తోంది. ఇంతకీ ఎవరీమె? ఎమిటామె సమస్య !**

నాన్న సలహా మేరకు డిజెబిలిటీ సర్టిఫికెట్ తెచ్చుకుందామని గవర్నమెంట్ ఆఫీసుకి వెళ్లింది దిశ. ఒక కళ్లు లేని అమాయిని సాయమడిగితే తన దఖాస్తునీ పూర్తిచేసింది. అప్పుడా అమ్మాయి 'మీ సమస్యేంటి' అనడిగితే నేను 'మరుగుజ్జు' అని సమాధాన మిచ్చింది దిశ. అర్థం కాలేదా అమ్మాయి దీంతో 'నా కాళ్లూ చేతులూ మిగతావారి కంటే చిన్నగా ఉంటాయని చెప్పింది దిశ. దానికామె అవయవాలన్నీ బాగానే పనిచేస్తున్నాయి కదా! అలాంటప్పుడు నీకు నువ్వు లోపమున్న వ్యక్తిగా ఎందుకు చెప్పుకొంటున్నావ్ అనడిగిందట. ఆలోచనలో పడిన దిశ సర్టిఫికెట్ తీసుకోకుండానే వెనుదిరిగింది. దిశ ఎత్తు 4.2అడుగులే. ఈమెది ముంబయి. జన్యులోపం కారణంగా అలా పుట్టింది. ఆటలన్నా, డాన్స్ అన్నా ప్రాణం. కానీ స్కూల్లో తోటివిద్యార్థులు చేర్చుకునేవారు కాదు. పెద్దయ్యేకొద్దీ పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఏం చేసినా ఏడిపించేవారు. బయటికి వెళ్లాలంటేనే భయపడేది.

ఈ క్రమంలో కాలేజీలో ఫెయిల్ అయ్యింది.

**ఆటల్లోనూ అడుగుపెట్టి ....** ఆమె అమ్మానాన్నలదీ ఇదే సమస్య. అయినా కూతురిని అన్నింటా ప్రోత్సహించే వారు. అలాంటిది ఆమె ఫెయిల్ అయ్యేసరికి తండ్రి దిగులుపడ్డాడు. ఆయన్నలా చూడలేకపోయింది దిశ. అందుకే ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రాఫిక్ డిజైనింగ్ చేసింది. ఆపై డిగ్రీ పూర్తయ్యింది. రెండు డిగ్రీలతో మంచి ఉద్యోగం ఖాయం. నాన్న ముందు గర్వంగా నిలబడొచ్చు అనుకుంటే.. అర్హతలన్నీ సరే కానీ.. మీరు ఉంటే ఇతరులు ఇబ్బందిగా ఫీలవుతారు అని తిరస్కరించేవారు. అర్హత ఉన్నా రూపం కారణంగా తిరస్కరించడంతో కుంగిపోయింది. దీంతో ఆమె తండ్రి మనకీ డిజెబిలిటీ సర్టిఫికెట్ ఇస్తారు. దాంతో అయినా ప్రభుత్వోద్యోగం పొందొచ్చు. ప్రయత్నించు అన్నారట. కానీ ఆ కళ్లు లేని అమ్మాయి మాటతో దాన్ని వదిలి సొంతంగా ఉద్యోగం ప్రయత్నించింది దిశ. హెచ్‌డిఎఫ్‌సీ, బిస్లరీ వంటి ఎన్నో సంస్థల్లో గ్రాఫిక్ డిజైనర్‌గా పనిచేసింది. ప్రస్తుతం రిచ్స్ ఇండియా క్రియేటివ్ హెడ్. అనుకోకుండా రైల్లో పరిచయమైన మరో వ్యక్తి స్ఫూర్తితో త్రో బాల్‌లో రాణించింది. నేషనల్ పారా బ్యాడ్మింటన్ ప్లేయర్, మారథాన్లలోనూ పాల్గొంటోంది.

**వారికి సాయపడాలనే...** తనలా ఎంతోమంది ఇబ్బంది పడటం గమనించంది దిశ. వాళ్లకి సాయపడాలని 2018లో లిటిల్ పీపుల్ ఇండియా (ఎల్‌పిఐ) ప్రారంభించింది. దీనిద్వారా మరుగుజ్జులకు ఉద్యోగాలు, క్రీడల్లో అవకాశాలను చూపిస్తోంది. దీనికోసం కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలనూ చేసుకుంది. సినిమాలు, సర్కస్‌లు.. కారణమేదైతేనేం పొట్టిగా కనిపిస్తే నవ్వేవారే ఎక్కువ. కానీ ఆ ప్రభావం వారిపై చాలా ఉంటుం దన్నది మర్చిపోతున్నారు. కాబట్టే, చాలా మంది తమ రూపాన్ని చూసుకుని బాధపడు తుంటారు. వాళ్లలో ఆత్మవిశ్వాసం నింపాలని ఎల్‌పిఐ ప్రారంభించా. ఏడుగురితో మొదలైన సంస్థలో ప్రస్తుతం 650 మంది సభ్యులున్నారు. ఉపాధి, క్రీడలు..నచ్చిన అంశాల్లో దేశవ్యాప్తంగా ఉన్న నాలాంటివారికి సాయమందిస్తున్నా. దీనికోసం ఎన్‌జిఓలతోనూ కలిసి పనిచేస్తున్నా. పొట్టి అనేకాదు, ఇంకా ఎన్నో రకాలుగా ఏడిపించడం సహజమే దాన్ని మనం పట్టించు కున్నప్పుడే ఓడిపోతాం. అలాకాకుండా వాట న్నింటినీ పక్కకునెట్టి, చుట్టూ ఉన్న అవకాశా లను అందుకుంటూ ముందుకు సాగండి. విజేతలుగా నిలుస్తా' అంటోన్న 39 ఏళ్ల దిశ టెడెక్స్ స్పీకర్ కూడా.

# 58వ ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



ప్రతి నెల మూడవ ఆదివారం ప్రొద్దుటూరు పట్టణంలో ఉన్న లక్ష్య హాస్పిటల్ నందు పేద ప్రజల కోసం ఉచిత కంటి మరియు గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహిస్తామని డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ హరిత తెలిపారు. ఈ నెల ఆదివారం 58వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ పాతకోట శ్రీనాథ్ రెడ్డి 42 మంది రోగులను ఉచితంగా పరీక్షించి, వీరిలో 22 మందికి ఉచితంగా ఇసిజి మరియు 8 మందికి ఉచితంగా గుండె స్కానింగ్ చేసి రోగులకు తగు చికిత్స, సూచనలు ఇచ్చారు.డాక్టర్ హరిత 34 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి,వారికి తగు చికిత్స, సూచనలు అందించారు.

# అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త.



ఒడిస్సా రాష్ట్రానికి చెందిన ఒక యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలం, బోయకొండ అటవీ ప్రాంతంలో ఉన్న కోళ్ల ఫారం వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు ధ్యాంచంద్ర నాయక్ కుమారుడు ఒడిస్సా రాష్ట్రం, ఇందుపూర్ జమ్మాలియా ప్రాంతానికి చెందిన గౌరీశంకర్ నాయక్ (27) ఉపాధి నిమిత్తం మదనపల్లెకు వచ్చాడు. నిమ్మనపల్లె మండలం బోయకొండ అటవీ ప్రాంతంలోని కోళ్ల ఫారాల వద్ద కాపలాదారుగా పనిచేస్తున్నాడు. అయితే, ఆదివారం తెల్లవారుజామున అతను తన పని ప్రదేశంలో విగతజీవిగా పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. అపస్మారక స్థితిలో ఉన్న గౌరీశంకర్ నాయక్‌ను స్థానికులు మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, అతను అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు. యువకుడి మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిన మరణమా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టనున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆటో బోల్తా నలుగురికి గాయాలు

మదనపల్లె క్రైమ్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త.



ఆటో అదుపు తప్పి బోల్తా పడటంతో దంపతులతో పాటు వారి ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గంగవరం మండలం బొమ్మనపల్లి గ్రామానికి చెందిన గంగరాజు (28), భార్య మాలశ్రీ (22), పిల్లలు తన్విక (04), తన్వితలతో కలిసి శనివారం రాత్రి ఆటోలో కర్ణాటకలోని తన అత్తగారి ఇంటికి వెళుతుండగా ఎలగటూరు సమీపం లో అదుపు తప్పి రహదారిపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# థమల్లయ్య కొండ భవిష్యత్తులో మరో శ్రీశైలం

తంబళ్లపల్లె ఫిబ్రవరి 15 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె మల్లయ్య కొండ భవిష్యత్తులో మరో శ్రీశైలం కావడం ఖాయమని తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చిన్నబాబు, తంబళ్లపల్లె సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడులు కొనియాడారు. వారిని ఈవో మునిరాజా, రాష్ట్ర టిడిపి బీసీ ఉపాధ్యక్షుడు నాయుడు,రాజంపేట తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, టిడిపి నాయకులు మల్లయ్య కొండకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ చిన్నబాబు, సీడ్ మల్లికార్జున నాయుడులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు పొందారు. మల్లయ్య కొండ మహాశివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో పాటు టిడిపి నాయకులను అభినందించి కూటమి పాలనలో మల్లయ్య కొండ మరింత అభివృద్ధి చేయడానికి సహకరిస్తామన్నారు.

# అల్లనేరేడు పండ్లకు జీఐ ట్యాగ్ కోసం దరఖాస్తు

కురబలకోట. ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వారు మదనపల్లె జామున్ ఫ్రూట్ (అల్లనేరేడు పండ్ల) కు భౌగోళిక సూచిక (జీఐ) ట్యాగ్ కోసం అధికారికంగా దరఖాస్తు సమర్పించినట్లు వైస్‌ఛాన్సలర్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. యూనివర్సిటీలోని మిట్స్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెసిలిటేషన్ సెంటర్ మద్దతుతో ఈ దరఖాస్తు పూర్తి చేయబడిందని ఆయన వెల్లడించారు. మదనపల్లె అల్లనేరేడు పండ్లకు గాఢ ఊదా రంగు, సమతుల్యమైన తీపిపులుపు రుచి, అధిక పోషక విలువలు, ఔషధ గుణాలు మరియు ఎక్కువకాలం నిల్వ ఉండే లక్షణాలు ప్రత్యేక గుర్తింపునిస్తాయని, ఇవి మదనపల్లె ప్రాంతంలోని ప్రత్యేక వ్యవసాయవాతావరణ పరిస్థితులతో ముడిపడి ఉన్నాయన్నారు.

# కొత్త డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



కన్నెలూరు మోటు ప్రాంతంలో ప్రధాన డ్రెయిన్‌లో నీరు నిలిచిపోవడంతో ఏర్పడిన సమస్యను నివారించడానికి కొత్త డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ కొత్త డ్రెయిన్ ద్వారా మురుగు నీరు మళ్లించడం, స్థిర నీటి సమస్య తొలగించడం జరిగిందని సంబంధిత అధికారులు తెలిపారు.

# బడ్జెట్‌లో చేనేతలకు తీవ్ర అన్యాయం

ప్రొద్దుటూరు క్రైం, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:

దేశంలో వ్యవసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించేది చేనేత రంగం. మనిషికి అన్నం, వస్త్రం, ఇల్లు ముఖ్యం. ఇందులో వస్త్రం లేకుండా ఒక్క గంట కూడా ఉండలేరని స్వర్ణభారత్ ప్రజాపార్టీ కన్వీనర్ మరయు ఫౌండర్ ఎస్.దశరథ రామయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన బడ్జెట్‌లో చేనేతలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఒక ప్రకటన ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. 2012 నుంచి 2018 వరకు కాంగ్రెస్, తెదేపాలు ప్రతి నెల చేనేతల ముడిసరుకుల కొనుగోలుకు రూ.600 సహాయం అందించాయి. 201లో టీడీపీ సహాయం 600 నుంచి రూ.1000కి పెంచింది. 2019 ఎన్నికల తరువాత 4 సంవత్సరాలు వైకాపా రూ.24000 వైకాపా అందించిందన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ సహాయం పూర్తిగా మరిచిపోయిందన్నారు. కేవలం 200 యూనిట్లు ఉచిత కరెంటుతో మమ అనిపించారన్నారు. గత సంవత్సరం సీఎం ప్రకటించిన రూ.25వేలు నగదు సాయం చేనేతలకు అందేలా చూడాలని కోరారు.

# శివ నామస్మరణతో మార్మోగ్రిన శివాలయాలు

లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని మండలంలోని శివాలయాలు శివ నామస్మరణతో మారుమ్రోగింది. మండల కేంద్రంలోని విశ్వ భారతి పాఠశాల సమీపంలో వెలసిన సర్వ మంగళ దేవి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామునే ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ హరి స్వామి రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆదివారం భక్తులతో కిట కోటలాడాయి. అనంతపురం ఈడిగపల్లి వద్ద వెలసిన శివాలయంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వేకువ జామునే లేచి స్థానాలు ఆచరించి స్వాములవారికి చప్పిడి గుగ్గిళ్ళు, పులిహోర, పెరుగన్నం సమర్పించారు.

# ఆధార్ డేటాలో తప్పులు సరిదిద్దడం చట్టబద్ధమైన హక్కు

(ప్రాథమిక హక్కుగా పరిగణిస్తూ మద్రాసు హైకోర్టు తీర్పు)

బద్వేలు లీగల్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:

ఆధార్ డేటాలో తప్పులను సరిదిద్దుకునే హక్కు చట్టబద్ధమైనదని మరియు ప్రాథమిక హక్కు అని కూడా పేర్కొంటూ పౌరులు ఈ హక్కును ఏలాంటి ఇబ్బందులు లేకుండా వినియోగించుకునేలా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) నిర్ధారించాలని మద్రాసు హైకోర్టు మధురై ధర్మాసనం తీర్పును వెలువరించింది. ఆధార్ ద్వారా ప్రయోజనాలను పొందే హక్కు, దాని వివరాలను సరిదిద్దే ప్రాథమిక హక్కును కలిగి ఉంటుందని జస్టిస్ జి.ఆర్.స్వామినాథన్‌తో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. "ప్రయోజనాలను పొందే హక్కు ప్రాథమిక హక్కు అయినపుడు మరియు ఆధార్ కార్డు తప్పనిసరి అయినపుడు కార్డుదారుడు మార్పు కోరే ప్రాథమిక హక్కును కలిగి ఉంటాడు" అనే అంశాన్ని ధర్మాసనం గమనించి ఆధార్ దిద్దుబాటు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన ప్రాథమిక సౌకర్యాలను ఉడాయ్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వివరాలలోకి వెళితే... తమిళనాడులోని పరమకుడికి చెందిన 74 సంవత్సరముల పి.పుష్పం అనే వితంతువు దాఖలు చేసిన రిట్ పిటీషన్‌ను అనుమతిస్తూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆధార్ కార్డులో ఆమె పేరు "పుష్పం" అని, అలాగే పుట్టిన తేదీ తప్పుగా నమోదు చేయడం వలన ఆమె కుటుంబ పెన్షన్ ఆలస్యమైంది. భారత సైన్యంలో 21 సంవత్సరములు పనిచేసిన మాజీ సైనికుడు పుష్పం యొక్క భర్త 2025 మే నెలలో మరణించాడు. ఆమె పెన్షన్ బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నపుడు ఆమె ఆధార్ వివరాలు పెన్షన్ రికార్డులతో సరిపోలేదని పేర్కొంటూ డిఫెన్స్ అకౌంట్స్ డిపార్టుమెంటు దానిని ప్రాసెస్ చేయడానికి నిరాకరించగా ఇ-సేవ మరియు పరీక్షా కేంద్రాల ద్వారా దిద్దుబాట్లు చేయడానికి ఆమె పదే పదే చేసిన ప్రయత్నాలు నిష్ఫలమవడంతో హైకోర్టును ఆశ్రయించారు. ఆధార్ (ఆర్థిక మరియు ఇతర సబ్సిడీలు, ప్రయోజనాలు మరియు సేవ, లక్ష్య, డెలివరీ) చట్టం-2016 లోని సెక్షన్-31 ని ఉటంకిస్తూ ఈ నిబంధన "మే" అనే పదాన్ని ఉపయోగించకుండా అందించిన సమాచారం ఖచ్చితమైనదని సంతృప్తి చెందిన తరువాత భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) యొక్క బాధ్యత తప్పనిసరి అవుతుందని ధర్మాసనం తేల్చి చెప్పింది. "తప్పులను సరిదిద్దడం చట్టబద్ధమైన చట్రంలో అంతర్భాగం అని, ప్రతి ఆధార్ కార్డులో సరైన జనాభా సమాచారం ఉండేలా చూసుకోవడం అథారిటీ పాత్ర అని ధర్మాసనం అభిప్రాయపడింది. సెక్షన్-31 యొక్క మొత్తం ఉద్దేశ్యం ఒకరి ఆధార్ కార్డులో సరైన వివరాలు ఉన్నాయని నిర్ధారించుకోవడం" అని ధర్మాసనం పేర్కొంది. ఆధార్ ఒక అనివార్యమైన గుర్తింపు పత్రంగా మారిందని మరియు ఖచ్చితమైన సమాచారం లేకపోవడం వల్ల పౌరులు ప్రయోజనాలు మరియు సేవలను కోల్పోయే అవకాశం ఉందని కూడా ధర్మాసనం పేర్కొనింది. తమిళనాడులోని అన్ని దక్షిణ జిల్లాలకు ఒకే ఒక ఆధార్ సేవా కేంద్రం ఎ.ఎస్.కె సేవలందిస్తుందని, దీని వల్ల పౌరులు ఇబ్బందులు పడుతున్నారని, వృద్ధులు మరియు దుర్భర దరఖాస్తుదారులు తరచుగా మధురై ఎ.ఎస్.కె వద్ద క్యూలలో నిలబడతారనే అంశాన్ని ధర్మాసనం గమనించింది. ఈ సందర్భంగా 2025 సంవత్సరంలో దివైర్‌లో వచ్చిన మీడియా కథనాన్ని ఉటంకిస్తూ స్థానిక కేంద్రాలకు ప్రాథమిక నవీకరణలను అందించడం ఇవ్వాలనే ప్రతిపాదనను ధర్మాసనం ఆమోదించింది. 2026వ సంవత్సరం మార్చి నాటికి తమిళనాడులో 28 క్రొత్త ఆధార్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలనే ఉడాయ్ ప్రతిపాదనను గమనించిన ధర్మాసనం పిటీషనర్ అంత కాలం వేచి ఉండలేరని ప్రకటించారు. ఆర్డర్ సమర్పించిన వెంటనే ఆమె ఆధార్ వివరాలను సరి చేయాలని మధురై ఎ.ఎస్.కె.ని ఆదేశించింది. మరియు ఆ తరువాత పెన్షన్ కూడా త్వరగా బదిలీ చేయడం గురించి ఆమె రక్షణ ఖాతాల విభాగాన్ని సూచిస్తూ ఆధార్ డేటాలో తప్పులు సరిదిద్దడం చట్టబద్ధమైన హక్కు అనగా ప్రాథమిక హక్కే అని తేల్చి చెబుతూ ఈ తీర్పును వెలువరించింది. (శీర్షిక: పి.పుష్పం ఎదిరి ఉడాయ్, డబ్ల్యుపి(ఎండి) నెం.29394/2025)

# ఎ.కొత్తకోటలో అలరించిన శివకోటి

చౌడేపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



శివకోటి హోమాధి కార్యక్రమాలు

మండలంలోని పంచాయతీ కేంద్రం ఎ.కొత్తకోటలో నిర్వహించిన శివకోటి భక్తులను అలరించింది. చంద్రమౌళీశ్వరాలయ నిర్మాణదాత, శ్రీ హరిహర హనుమదీశ్వర శ్రీ అయ్యప్ప సాయిరాం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు, సనాతనధర్మ పరిరక్షణా అవార్డు గ్రహీత ఎస్కే వెంకట్రమణారెడ్డి ఆయన సతీమణి రతీదేవిల ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురష్కరించుకొని ఆలయంలో హోమాది కార్యక్రమాలు జరిగాయి. వారిచే ఏర్పాటు చేయబడ్డ శివకోటి ప్రత్యేక ఆకర్షణగా నిలచింది. లోక కళ్యాణార్థం ఆలయంలో హోమాది కార్యక్రమాలను శివయ్య సన్నిధిలో జరిపినట్లు ఎస్కేఆర్ వివరించారు.

# బీసీ శకానికి నాంది పలుకుదాం రండి : హరిబాబు

చౌడేపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

బీసీ శకానికి నాంది పలికేందుకు విజయవాడకు తరలి రావాలని పుంగనూరు నియోజకవర్గ బీసీవై పార్టీ కన్వీనర్ హరిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. ఈనెల 22న విజయవాడలో తలపెట్టిన బీసీ సింహ గర్జన మహాసభ విజయవంతం కోరుతూ శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు తరతరాలుగా రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురవుతున్నామన్నారు. ఐకమత్యంతో వుండి హక్కులను సాధించుకొనే దిశగా అడుగులేద్దామన్నారు. ఈమేరకు బీసీవై పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ తలపెట్టిన బీసీల సింహగర్జనకు తరలి రావాలన్నారు. అనంతరం అమ్మవారికి 108కొబ్బరి కాయలను కొట్టారు. సోషియల్‌మీడియా కోఆర్డినేటర్ కుమ్మర గిరిబాబు, ఓబీసి విద్యార్థి సంక్షేమ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌యాదవ్, నాయకులు శంకర, గణేష్, వెంకటేష్‌యాదవ్, గౌడ పాల్గొన్నారు.

# విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఓబుల్ రెడ్డి మృతి

రాజంపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కూండ్ల ఓబుల్ రెడ్డి మృతి (82) ఆదివారం మరణించారు. వారం రోజులుగా అనారోగ్యంతో ఆయన చికిత్స తీసుకుంటున్నారు. తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. రాజంపేట మున్సిపల్ కౌన్సిలర్ కూండ్ల వెంకటరమణారెడ్డి తండ్రి అయిన ఓబుల్ రెడ్డి సుదీర్ఘ కాలం ఒంటిమిట్ట ,రాజంపేట, పెనగలూరు మండలాల్లో ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు.కూండ్ల ఓబుల్ రెడ్డి మృతి విషయం తెలిసిన వెంటనే రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్ రెడ్డి, వైసిపి నేతలు యోగేశ్వర్ రెడ్డి, బాబుల్ రెడ్డి, ధ్వజారెడ్డి,రాజంపేట మున్సిపల్ కౌన్సిలర్లు పోలా వెంకటరమణారెడ్డి,డొంక సూరి, పసుపులేటి సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు పిండిబోయిన రాముయాదవ్ లు పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. అలాగే వైసిపి రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మేడ మల్లికార్జునెడ్డిలు వేర్వేరు ప్రకటనలలో సంతాపం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ రమణారెడ్డిని ఓదార్చారు.సోమవారం ఉదయం రాజంపేట పట్టణం నలంద హైస్కూల్ సమీపంలోని మెహర్ బాబా కాలనీలో అంత్యక్రియలు జరుగుతాయి.

# శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

గాలివీడు, ఫిబ్రవరి 15(ప్రభాతవార్త):



మండలంలోని ప్రముఖ శైక్షేత్రాలలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. పవిత్ర పాపాఘ్నిన దీతీరాన వెలసిన గండిమడుగు శ్రీ ఉమా మహేశ్వర స్వామి ఆలయం కుసావతీ నదీతీరాన వెలసిన శ్రీ వీరాంజనేయ గణపతి సమేత శివాలయం, ఎగువగొట్టివీడు రామలింగేశ్వర ఆలయం, తలముడిపి పెద్దగుడి ఆలయం నక్కలవాండ్లపల్లి శివాలయాలలో వేకువజామునే లింగోద్భవునికి పలు అభిషేకాలు నిర్వహించి మూలవిరాట్ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరింపజేసి బక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గండిమడుగులో అన్నప్రసాద వితరణ శ్రీరామ జ్యువెలర్స్ రామానుజులు వారి కుటుంబసభ్యులు మా క్రాకర్స్ ఆర్యశంకర్, డీలర్ శంకర్ నారాయణ ఆధ్వర్యంలో ఆది, సోమవారాలలో అన్నప్రసాద కార్యక్రమాలు జరగనున్నాయి. గండిమడుగులో వచ్చిన భక్తులకు గోపనపల్లెకు చెందిన డీలర్ మిట్టపల్లి వెంకటరమణారెడ్డి వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో లడ్డుప్రసాదాన్ని వితరణ గావించారు. మండలంలోని అన్ని శివాలయాలలో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.



# అంబరాన్నంటిన శివరాత్రి సంబరాలు



ప్రొద్దుటూరు అర్బన్ ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు నడిబొడ్డున వెలసిన శ్రీ అగస్తీశ్వర స్వామి (శివాలయం) ఆలయంలో చైర్మన్ వంగల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నో భక్తి కార్యక్రమాలతో శివరాత్రి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా శివాలయంలో భక్తులు చేసిన శివనామ స్మరణలతో మారుమోగై శివ శివ హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు పరమశివుని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం సుముహూర్తంలో వేదమంత్రాలు వరుస్తుండగా కన్నుల పండుగ మంగళ వాయిద్యాలతో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామి రెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బజ్జల పుల్లయ్య మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# లంక మల్లేశ్వర స్వామి వద్ద వైద్య శిబిరం

బద్వేల్ అర్బన్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బద్వేల్ మరియు అట్లూరు మండలాల సంయుక్త ఆధ్వర్యంలో లంక మల్లేశ్వర స్వామి దేవాలయం సమీపంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయం వద్దతో పాటు రెడ్డి బాయి (బేస్ క్యాంప్) వద్ద కూడా యాత్రికుల కోసం వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. ఈ శిబిరాన్ని బద్వేల్ ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మల్లేష్ అకస్మికంగా తనిఖీ చేశారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అత్యవసర వైద్యసేవలు సిద్ధంగా ఉంచాలని, సిబ్బంది అందరూ సేవాభావంతో వ్యవహరించాలని ఆయన సూచించారు. శిబిరం సందర్భంగా ఆరోగ్యం సరిగా లేకపోయిన 14 సంవత్సరాల బాలుడిని అత్యవసర సేవల ద్వారా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ హమీదా బేగం, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సి. మురళీకృష్ణ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య, హెల్త్ సూపర్వైజర్ రజియా సుల్తాన్, సుబ్రహ్మణ్యం, విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలయానికి మైక్‌సెట్ వితరణ

కలికిరి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:



మండలంలోని గుట్టపాలెం పంచాయతీ కస్పా సమీపంలో ఉన్న దళితవాడలోని శ్రీమాతమ్మ తల్లి అమ్మవారి ఆలయానికి వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి కంభం ద్వారకనాథ్‌రెడ్డి తన సొంత నిధులతో సుమారు రూ.17వేలు విలువైన మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఇటీవల దళితవాడకు చెందిన మహిళలు, గ్రామస్థులు తమ ఆలయానికి మైక్‌సెట్ కావాలని కంభం ద్వారకనాథ్‌రెడ్డిని కోరారు. వెంటనే స్పందించి ద్వారకనాథ్‌రెడ్డి ఆదివారం దళితవాడకు చేరుకొని మాతమ్మ పూజా కార్యక్రమంలో పాల్గొని ఆలయానికి మైక్‌సెట్ వితరణ చేశారు. దీంతో గ్రామస్థులు ద్వారకనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ద్వారకనాథ్‌రెడ్డి రాజంపేట ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదేశాలతో పంచాయతీలలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆపదలో ఉన్న వారికి తమ వంతు ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలబడుతున్నారు. దీంతో ఆయన సేవల పట్ల ఎంపీ వెంకట మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సైతం ద్వారకనాథ్‌రెడ్డిని అభినందించారు. ఆదివారం మరోసారి మైక్‌సెట్‌ను వితరణ చేసి తన దాతృత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తవళం శివాలయంలో కళ్యాణోత్సవం

నిమ్మనపల్లె, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలం తవళం శివాయంలో మహాశివరాత్రి సందర్భంగా ఆదివారం పగలు శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేఖాలు జరగగా రాత్రి శివ పార్వతుల కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు నరసింహా, రెడ్డప్ప, శంకరస్వాముల ఆధ్వర్యంలో కళ్యాణోత్సవం వివిధ రకాల వాయిద్యాదల మధ్య జరిగింది. ఈఓ మంజుల, కాబోయే చైర్మెన్ మేష రెడ్డిమోహన్, సర్పంచ్ రెడ్డప్ప, పార్టీ అధ్యక్షులు రాజన్న, అన్నదాత ధర్మకర్త రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. అన్నదానం జరిగింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆర్టీసి బస్సులు నడిచాయి. దేవాలయానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పూజలు అందుకుంటున్న నేలమల్లేశ్వరస్వామి

## భక్తులు అడవికి నిప్పు పెట్టకుండా

# అవగాహన కల్పించండి

కడప జిల్లా డిఎఫ్ఓ వినీత్ కుమార్



సిద్దవటం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిత్యపూజ స్వామిని దర్శించుకునే భక్తులు అడవికి నిప్పు పెట్టకుండా అవగాహన కల్పించాలని వైయస్సార్ కడప జిల్లా డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ వినీత్ కుమార్ అటవీశాఖ సిబ్బందికి సూచించారు. శివరాత్రి పర్వదిన సందర్భంగా ఆదివారం సిద్ధవటం రేంజ్ నందు గల పంచలింగాల ప్రదేశానికి చేరుకుని సిబ్బంది పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యపూజ కోన గుడికి వెళ్లే భక్తులకు అటవీశాఖ తరపున చేయవలసిన ఏర్పాట్లను మరియు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించామన్నారు. అడవికి నిప్పు పెట్టవద్దని, భక్తులు కాలిబాట మార్గం లోనే ప్రయాణించి జంతువుల బారిన పడకుండా జాగ్రత్త పడాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఓబులేసు, బీటు అధికారి పెంచల్ రెడ్డి మరియు అటవీ సిబ్బంది పాల్గొన్నారు.గాయపడిన వృద్ధులకు అటవీ సిబ్బంది సహాయం నిత్యపూజ స్వామిని దర్శించుకుని పంచలింగాలకు వచ్చే మార్గమధ్యంలో గాయపడిన వృద్ధులకు అటవీ సిబ్బంది డ్యూటీలో భాగంగా వారికి సహాయం చేసి పంచలింగాల దగ్గర క్షేమంగా చేర్చారు. సిద్ధవటం అటవీ శాఖ సిబ్బంది ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా పంచ లింగాల నుండి నిత్యపూజ కోన ఆలయం వరకు తిరుగుతూ భక్తులకు అడవికి నిప్పు పెట్టవద్దని, కాలిబాటల మార్గంలోని ప్రయాణించాలని జాగ్రత్తలు చెప్పారు.

# మామిడి తోటల్లో పూత సువాసలు

రామసముద్రం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :



విరగబూచిన మామిడిపూత.

పడమటి ప్రాంతాల్లోని అన్నమయ్య జిల్లా రామసముద్రం నియోజకవర్గంలోని మామిడి తోటలు సువాసనలు వెదజల్లుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మామిడి చెట్లు మామిడి పూతతో కళకళలాడుతున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులా వున్న ఈమామిడి తోటల వద్ద మామిడిపూలు వాసనతో ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. ఈమామిడి తోటలు కనువిందు చేస్తున్నాయి.

# అఖండ మల్లేశ్వరునికి ఘనంగా పూజలు

కురబలకోట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :



మహాశివరాత్రి సందర్భంగా మండలంలోనే ప్రజలు ఆదివారం శివాలయాలకు వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగళ్లు సమీపాన మల్లయ్యకొండపై వెలసిన శ్రీ అఖండమల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులతో పోటేత్తింది. ఆదివారం ఉదయం అఖండ మల్లేశ్వరస్వామి ఆలయంలో గోపూజతో ప్రారంభమై గంగాపూజ, స్వస్థినావాచనం, నాంది వృద్వికరణం, కలశంపూజా, మహామంగళి హారతి, పూజలు నిర్వహించారు. రాత్రికి భక్తుల శివపార్వతుల కళ్యాణోత్సవం అనంతరం భక్తాదులు కాలక్షేపం కోసం మౌనిక భరతనాట్యం, కోలాటాలు, చెక్కభజనలు, నిర్వహించారు. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చాందీని బండ్లల్లో కోలాటాల, భజనలు, దేవరెద్దును ఊరేగించి తమ మొక్కుబడులను చెల్లించారు. రాత్రి జాగరణ చేసిన వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. సోమవారం కూడా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. చైర్మెన్ కాకర్ల క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

# స్మశాన వాటిక అభివృద్ధి రూ.50 వేలు ఆర్థిక సహాయం

సంబేపల్లి ఫిబ్రవరి 15 ప్రభాతవార్త



సంబేపల్లి గ్రామం నామాలగుట్టకు చెందిన ప్రజల సౌకర్యార్థం స్మశాన వాటిక అభివృద్ధి కోసం ఆదివారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి యాభై వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ ఆర్థిక సహాయం మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా అందజేయబడింది. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా, స్మశాన వాటిక అభివృద్ధికి ఈ విరాళం ఎంతో ఉపయోగపడనుందని స్థానికులు పేర్కొన్నారు.

# తిరుణాల ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి

చిన్నమండెం పిబ్రవరి 15 ప్రభాతవార్త:



మండలంలోని దేవగుడి పల్లి గ్రామంలో సోమవారం జరగనున్న చింతోళ్ల మాలే తిరునాళ మహోత్సవం ఏర్పాట్లను ఆదివారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. మంత్రి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఉదయం తిరునాలలో ఉదయం 11 గంటల నుండి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కావున ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి నాయకులు ప్రజలు కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి యువ నాయకులు మండిపల్లి రాహుల్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ,వంగవీటి మోహన రంగాలకు నివాళులు

కురబలకోట ఫిబ్రవరి 15 ప్రభాతవార్త

స్వర్గీయ నందమూరి తారక రామారావు, వంగవీటి మోహన్ రంగాలకు తంబాలపల్లి మాజీ ఎమ్మెల్యే జి .శంకర్ యాదవ్ ఘనంగా నివాళులర్పించారు. ఆయన తంబాలపల్లి మండలం మల్లయ్య కొండల వెలసిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దర్శనార్థం వెళుతూ మార్గమధ్యలో.ఆదివారం కురబలకోట మండలం అంగళ్ళ బస్టాండ్ లోని వారి విగ్రహాలకు పూలమాలలు వేసి శంకర్ యాదవ్ ఘనంగా నివాళులర్పించారు. వారు ఏపీ ఉమ్మడి రాష్ట్రంకు చేసిన సేవలను పార్టీ పటిష్టతకు చేసిన సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఆయన రాకతో మండలంలోని సర్కార్ తోపు, చేనేత నగర్, టొమాటో మార్కెట్, అంగళ్లు బస్టాండ్ , ముదివేడు క్రాస్ ప్రాంతాల్లో టిడిపి శ్రేణులు, అభిమానులు బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. టిడిపి తంబళ్లపల్లె ఇన్చార్జి ఆయనకి ఇవ్వాలంటే కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆయన స్థానిక టిడిపి నాయకులు పేరుపేరు నా పిలిచి పలకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ జంగా ఎల్లారెడ్డి, టిడిపి యూత్ నాయకులు శెట్టి సీతారాం బాబు, సురేంద్ర యాదవ్. వైజీ రమణ, తిమ్మ రాయుడు, సిటి ఎం లక్ష్మన్న, టీచర్ నరసింహులు, హోటల్ నాయుడు, మల్లికార్జున, చలపతి, రాజారెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# శివనామస్మరణాలతో మార్మోగిన నిత్యపూజ కోన

**అడుగడుగునా ట్రాఫిక్ జామ్ ఇబ్బంది పడ్డ భక్తులు... కన్నుల పండుగగా శివపార్వతుల కళ్యాణోత్సవం**






**సిద్దవటం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

నిజమైన దేవుడా నిత్యపూజయ్యా అంటూ భక్తుల స్మరణాలు పవిత్ర మహాశివరాత్రి పర్వదినాన హర హర మహాదేవ శంభోశంకర.. ఆపద మొక్కులవాడ నిత్యపూజయ్య అంటూ భక్తుల శివనామ స్మరణాలతో ఆదివారం నిత్య పూజ కోన మార్మోగింది. ప్రతి ఏటా ట్రాఫిక్ సమస్యలు తలెత్తి భక్తులు ఇబ్బందులు పడగా ఈ ఏడాది కూడా భక్తులు ఇబ్బంది పడ్డారు. భక్తుల వాహనాలకు పోలీసులు ఈద్గా వద్ద ఆపి వేసి భక్తులను ఆర్టీసీ బస్సుల్లో ఎక్కించడంతో వారు నిత్యపూజ కోనకు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించారు. పోలీసులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా అక్కడక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తి భక్తులు ఇబ్బంది పడ్డారు. మరికొందరు భక్తులు ఎండను సైతం లెక్క చేయకుండా కాలినడకన నడుచుకుంటూ వెళ్లి నిత్యపూజయ్యను దర్శించుకున్నారు. నిత్యపూజ కోనలోని కొలను వద్ద జాలువారే జలపాతంలో భక్తులు పవిత్ర స్నానమాచరించి నిత్య పూజయ్యను దర్శించుకున్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖా ఆధ్వర్యంలో ఆలయ ఇంచార్జి ఈఓ శ్రీధర్, ఛైర్మెన్ జంగిటి రాజేంద్ర ప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. పండితులు చైతన్య శర్మ, అర్చకులు రంగసముద్రం సుబ్రమణ్యం శర్మలు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణ ధారణ, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు, ఆశీర్వచనం వంటివి పూజా కార్యక్రమాలను నిర్వహించి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండగలా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవానికి భక్తులు చదివింపులు చేశారు. ఈ సంధర్భంగా నిర్వహించిన లడ్డు ప్రసాద వేలంలో వేలం పాటలో కళ్యాణోత్సవ లడ్డును 25 వేలకు వంతాటి పల్లి యూత్ దక్కించుకున్నారు. రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్నాధ్ హెగ్డే పర్యవేక్షణలో ఒంటిమిట్ట సిఐ నరసింహ రాజు ఆధ్వర్యంలో సీఐలు, సిద్దవటం ఎస్సైలు హారిక, తదితర ఎస్సైలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అడుగడుగునా దాతలు అన్నదాన కార్యక్రమాలు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. శివనామస్మరణాలతో మార్మోగిన శైవక్షేత్రాలుమండలంలోని కడప చెన్నై జాతీయ రహదారిలోని కనుములోపల్లి సమీపంలో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సంధర్భంగా భక్తుల శివనామస్మరణాలతో మార్మోగింది. శివపార్వతుల కళ్యాణమహోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు సోమా బాబు ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. రాత్రి లింగోద్భవ కాలంలో అష్టోత్తర మహాలింగేశ్వ ర స్వామికి లింగోద్భవ కాలంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సామా బాబు తెలిపారు. అలాగే సిద్దవటం పెన్నానది ఒడ్డున వెలసిన ప్రాచీన మైన శ్రీశైలానికి దక్షిణ ద్వారమైన శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కపర్తీస్వర కొనలోసిద్దవటం మండలంలోని సిద్దవటం బద్వేలు మార్గమధ్యంలో లంకమల అభయారణ్యంలో వెలసిన కపర్దీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, శివపార్వతుల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని జ్యోతి గ్రామంలో వెలసిన జ్యోతి సిద్దవటేశ్వర స్వామి ఆలయంలో మహ శివరాత్రి మహోత్సవాలు ఘనంగా జరిగాయి.

## తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం డైరీ ఆవిష్కరణ



**లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం డైరీ ని ఆదివారం మంత్రి మంటపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిన్న అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యాశాఖ కు ప్రభుత్వం పెద్దపేట వ వేస్తూ 32 308 కోట్ల రూపాయలు కేటాయించారని ఆయన అన్నారు విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నాడన్నారు. కాబోయే కాలంలో విద్య వ్యవస్థ ఎంతో మార్పు చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కన్వీనర్ వీరాంజనేయులు అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి ప్రధాన కార్యదర్శి చంద్ర పవన్ శంకర్ శ్రీనివాసులు రామకృష్ణ శివరామకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు

**రాయచోటి టౌన్ ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

పట్టణంలోని చెక్ పోస్ట్ దగ్గర వెలసిన శివాలయం నందు ఆదివారం శివరాత్రి పండుగను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ సందర్భంగా శివాలయంకు విచ్చేసిన భక్తులకు ప్రజలకు రాష్ట్రం లోనే ప్రజలందరూ సుఖ సంతోషాలతో శివరాత్రి పండుగను జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మట్లి సర్పంచ్ నాగార్జునాచారి పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ప్రతిబింబించేలా బడ్జెట్

**టీడీపీ అసెంబ్లీ ఇంచార్జ్ జగన్మోహన్ రాజు**



**రాజంపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ప్రతిబింబించేలా బడ్జెట్ ఉందని, అన్ని ప్రాంతాలను సమగ్ర అభివృద్ధి చేసేందుకు, అన్ని రంగాలకు ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్ కేటాయింపులు జరిగాయని తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. రాష్ట్ర దశాదిశా మార్చేలా బడ్జెట్ కేటాయింపులు జరిగాయని అభివర్ణించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలను సంతృప్తిపరిచేలా కేటాయింపులు ఉన్నాయన్నారు. సంక్షేమానికి , అభివృద్ధికి సమతూకంగా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసమే అనేలా బడ్జెట్ కేటాయింపులు చేయడం శుభసూచకమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు భారీ కేటాయింపులు రైతులపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు, అన్ని మతాలకు, అన్ని ప్రాంతాలకు మేలు జరిగేలా వ్యవహరించడం కూటమి ప్రభుత్వం కే సాధ్యం అన్నారు. కేంద్ర ప్రభుత్వ కీలక పథకాలకు కూడా రాష్ట్ర బడ్జెట్లో వాటా ఇవ్వడం రాష్ట్ర అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. రాష్ట్రంలోని రైతులు కార్మికులు, కర్షకులు, పరిశ్రమలు, వ్యాపారులు ప్రతి ఒక్కరు రాష్ట్రంలో స్వేచ్ఛగా ముందుకు వెళ్లేలా బడ్జెట్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంఈఏడాది బడ్జెట్ తో వచ్చే ఏడాదికి మరో మెట్టు ఎక్కడం ఖాయం అని జగన్ మోహన్ రాజు విశ్వాసం వ్యక్తం చేశారు.

## మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



**బద్వేలు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బద్వేల్ నియోజకవర్గంలోని పలు శివాలయాల్లో భక్తి శ్రద్ధలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శివనామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. బద్వేల్ పట్టణంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ రితేష్ రెడ్డి, ఆయన సతీమణి లీలాకైవల్యా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గోపవరం మండల అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ మల్లంకొండేశ్వర స్వామి దేవస్థానం ను రితేష్ రెడ్డి దర్శించుకుని అభిషేకాలు నిర్వహించారు. ఇదే సందర్భంగా పోరుమామిళ్ల మండలంలోని గుర్రప్ప గారి స్వామి దేవాలయం మరియు బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని రూపురాంపేట శివాలయం లో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి శివనామస్మరణ జరిపి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ




**బద్వేల్ అర్బన్, ఫిబ్రవరి 15 , ప్రభాతవార్త**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వాసవి క్లబ్ బద్వేల్ మరియు వనితా క్లబ్ బద్వేల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ప్రసాద వితరణ చేపట్టారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆదేశాల మేరకు పోరుమామిళ్ల రోడ్డులోని నాగులకట్ట చెరువు సమీప శివాలయంలో ఉదయం 7.30 గంటలకు స్వామివారి పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం దాతల సహకారంతో భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఐఈసీ ఆఫీసర్, ఐపీసీ ఆఫీసర్, పీఎస్టీలు, సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సహకరించిన దాతలకు వాసవి క్లబ్, వనితా క్లబ్ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వాసవి క్లబ్ బద్వేల్ అధ్యక్షుడు భూపాలం రాఘవేంద్ర, కార్యదర్శి చిందుకూరి వెంకటరమణ, కోశాధికారి బైసాని సుమంత్, వనితా క్లబ్ అధ్యక్షురాలు చాటకొండు కోటేశ్వరమ్మ, కార్యదర్శి చిప్పగిరి వెంకట రమణమ్మ, కోశాధికారి బచ్చు పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# శివ భక్తులతో కిటికీటలాడిన ఆలయాలు శైవ క్షేత్రాలు




**మైదుకూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**

మండలంలోని శివాలయాలలో మహాశివరాత్రి సందర్భంగా వేకుజామున నుంచే పలు ప్రాంతాలలో శైవ క్షేత్రాల నందు శివ భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు భక్తులు శివోహం శివనామ స్మరణతో ఆలయాలు మారుమోగాయి. స్థానిక పట్టణంలోని శ్రీశ్రీశ్రీ భీమేశ్వర స్వామి (మరకత లింగం) పార్వతి దేవి, చిన్నయ్యగారిపల్లె ముక్కొండ శివయ్య, నల్లమల్ల అడవుల్లో ఉన్న భైరవకోనలో మొండి భైరవుడికి పలు ఆలయాలలో తెల్లవారుజామున నుంచి భక్తులు ఆలయాలకు పోటెత్తారు. పలుచోట్ల శివుడికి రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. శివాలయాలలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ప్రసాదం, భోజనాలు త్రాగునీరు తోపాటు పలు సౌకర్యాలు కల్పించి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు పెద్దలు యూత్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు. మైదుకూరు పట్టణ శ్రీ మాధవరాయ స్వామి దేవస్థానం నందు మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీశ్రీశ్రీ భీమేశ్వర స్వామి (మరకత లింగం) పార్వతి దేవి స్వామి వార్ల కళ్యాణం సాయంత్రం 04 గంటలకు అనంతరం కళ్యాణమూర్తుల గ్రామోత్సవం 08 గంటలకు నిర్వహించడంతో పాటు రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలము సామూహిక రుద్రాభిషేకములు జాగరణ, శివరాత్రిలో భక్తులు ఎక్కువ శాతం ఉపవాస జాగరణ చేస్తారు. మహాశివరాత్రి మాఘు బహుళ చతుర్దశి పరమశివుడు లింగ రూపంలో ఆవిర్భవించిన పవిత్రమైన రాత్రి. ఇది ఆత్మ జాగరణకు, విజయానికి ప్రతీక. శివపార్వతుల కళ్యాణం జరిగిన రోజుగా నీలకంఠుడుకి ప్రత్యేకత ఉంది. అర్ధరాత్రి 12 గంటల సమయంలో శివుడు జ్యోతిర్లింగంగా అవతరించాడని ఆ సమయంలో అభిషేకం చేస్తే పాపాలు తొలగిపోతాయని విశ్వాసం భక్తులకు అందుకే శివరాత్రి రోజున భక్తులు ఉపవాసంతో రోజంతా మేల్కొని శివనామ స్మరణ ఓం నమఃశ్శివాయ చేయడం వల్ల ఆధ్యాత్మిక శక్తి లభిస్తుందని భక్తులకు నమ్మకం శివరాత్రి రోజున భక్తితో చేసే శివరాధన ఐశ్వర్యాన్ని సుఖసంతోషాలను కలిగిస్తుందని పురాణాలు చెబుతాయి. వీటికి హిందువుల్లో నమ్మకం. అందువల్ల శివరాత్రి రోజున ఉపవాసాలతో జాగరణ చేస్తారు.

## వైభవం.. శివపార్వతుల కల్యాణం

**నందలూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :**

నందలూరు గ్రామపంచాయతీలో వెలసిన అర్ధనారీశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం శివపార్వతుల కళ్యాణం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయ పూజారి నాగరాజ స్వామి వేదమంత్రాల మధ్య కళ్యాణాన్ని జరిపించారు. ముందుగా శివపార్వతులను ప్రత్యేక అలంకరణతో ముస్తాబు చేశారు. స్వామివారికి పట్టు వస్త్రాలను నారపు శెట్టి బలరాం-చంద్రకళ దంపతులు, ముత్యాల తలంబ్రాలను దక్షిణం సుబ్బరాయుడు సమర్పించారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అనంతరం తిరుపల్లి శ్రీను, కొవ్వూరు వెంకటేష్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పల్లె సుబ్రహ్మణ్యం, తోట కేదార్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



# శివనామస్మరణలతో శివాలయాల్లో శివరాత్రి వేడుకలు




**మదనపల్లె, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :**

పట్టణంలోని ప్రముఖ శివాలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో శివనామస్మరణలో ఘనంగా జరుపుకొన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చంద్రకాలనీ అమ్మచెరువుమిట్ట, మడికయ్యల శివాలయం, దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఫణికుమార్‌శర్మ పంచపలమృత మహాన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయాన్ని పూలతో అలంకరించారు. భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. అదే విధంగా సిటిఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ యోగాభోగేశ్వరస్వామి(మడికయ్యల శివాలయం)లో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో పరమశివునికి భక్తుల స్వహస్తాలతో జలాభిషేకం నిర్వహించారు. బర్మావీధిలోని సాయిబాబ ఆలయంలో శివుడికి అభిషేకాలు పూజలు చేశారు. అనంతయ్య బంగ్లావీధిలోని పంచలింగాల మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల వద్ద ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా డిఎస్‌పి ఆధ్వర్యంలో గట్టి పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తీ శ్రద్దలతో మహాశివరాత్రి

**తొండూరు ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని శివాలయంలో ఉదయం 5 గంటల నుండి, మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నాగరాజు శర్మ నేతృత్వంలో స్వామివారికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, మంత్రపుష్పం, మహా మంగళహారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని తోమాలలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి ఆలయం గర్భగుడి చుట్టూ ప్రదక్షిణలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు పంచామృతాలు నైవేద్యాలు అందజేయడం జరిగింది అధిక సంఖ్యలో భక్తులు మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## హరనామ స్మరణతో మార్మోగిన శైవాలయాలు



**చౌడేపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

మాఘమాసం...కృష్ణపక్షం...త్రయోదశి నడిరాత్రి ఉద్భవించిన సృష్టికర్త పరమశివుడు...దేవదేవుని శివరాత్రి సందర్భంగా మండలంలోని శైవాలయాలన్నీ భక్తులతో కళకళలాడాయి. స్థానిక మృత్యుంజయేశ్వరస్వామి, పుదిపట్ల పంచ లింగాలు, లద్దిగం నీలకంఠేశ్వరస్వామి, చారాల కాశీవిశ్వేస్వరాలయం, గోసలకురపల్లి శరభరాయస్వామి, ఎ.కొత్తకోట చంద్రమౌళీశ్వరాలయం, ఎర్రపల్లి నందీశ్వరాలయాల్లో విశేషాభిషేకాలు, పూజలు జరిగాయి. పుదిపట్ల వైష్ణవీమాతను ప్రధానార్చకురాలు శ్రావణి అర్ధనారీశ్వరీ అవతారం గావించారు. స్థానిక మృత్యుంజయేశ్వరాలయంలో రాత్రంతా భక్తులు జాగారణ వుండి స్వామివారికి జాముల అభిషేకాల్లో పాల్గొన్నారు. నందీశ్వరాలయం ఎర్రపల్లిలో జాతర జరిగింది.

## లుక్ అండ్ లైక్ షోరూమ్ ప్రారంభం



షోరూమును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**

పట్టణంలోని రీడింగ్ రూమ్‌వీధిలో ఆదివారం లుక్ అండ్ లైక్ షోరూమను ఎమ్మెల్యే షాజహాన్‌బాషాచే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌ఆర్‌వీధిలోని ఖాదర్ కుట్టీ ఆహ్వానం మేరకు వచ్చి షోరూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. షోరూములో ప్రతి వస్తువు, బట్టలు నాణ్యతగా సరళమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని, సామాన్యుడిని దృష్టిలో ఉంచుకొని ఈ షోరూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివనామ స్మరణతో మోగిన కోన గవేశ్వర స్వామి క్షేత్రం

**ఘనంగా మహాశివరాత్రి వేడుకలు... ఆకట్టుకున్న దేశీ ఎద్దుల బండలాగుడు పోటీలు**



చిత్ర పటాన్ని అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అలంకరణలో మూల విరాట్



బండ లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న బీటెక్ రవి

**పులివెందుల, ఫిబ్రవరి 15 , ప్రభాతవార్త :**

మండలంలోని మోట్నూతలపల్లె గ్రామ పరిధిలో ఉన్న శ్రీ కోన గవేశ్వర స్వామి క్షేత్రం మహాశివరాత్రి సందర్భంగా శివనామ స్మరణతో మారు మోగింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించగా, ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కళకళలాడింది. రోజంతా భక్తులు రాకపోకలు సాగిస్తూ, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పండుగ సందర్భంగా గ్రామస్థులు దేశీ ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. విజేతలకు దాతల చేత బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి 30 వేల నగదును నల్లపురెడ్డి పల్లె కి చెందిన అజ్జుగుట్టు భాస్కర్ రెడ్డి, కొమ్మా రామ మల్లేశ్వరరెడ్డి అందించారు. రెండవ బహుమతి 25 వేల నగదును బ్రాహ్మణ పల్లె గ్రామానికి చెందిన మద్దూరు వెంకటరామిరెడ్డి , తృతీయ బహుమతి 20 వేలు శ్రీ సాయి చైతన్య జూనియర్ కాలేజి కరెస్పాండెంట్ నారాయణరెడ్డి, నాల్గవ బహుమతి 15 వేలు మోట్నూతలపల్లె గ్రామానికి చెందిన ఓగుబోయిన రమేష్, ఐదవ బహుమతి 10 వేలు ఇ.కొత్తపల్లె గ్రామానికి చెందిన తొండూరు శంకర్, ఆరవ బహుమతి మోట్నూతలపల్లె గ్రామానికి చెందిన గండి రవి , కన్సలేషన్ బహుమతులకు 10 వేలు తపస్య జూనియర్ కాలేజి కరెస్పాండెంట్ ఆవుల చంద్ర ప్రసాద్ రెడ్డి 5 వేలు మోట్నూతలపల్లె గ్రామానికి చెందిన గండి ప్రసాద్‌లు విజేతలకు అందించారు. భక్తులకు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి గురువు ఆస్పరి మస్తాన్ ఆధ్వర్యంలో ఈ.కొత్తపల్లె చిన్నారులు కోలాటం ప్రదర్శించగా, రాత్రి 8 గంటల నుంచి పుష్పగిరి హైస్కూల్ (సాయిబాబా) విద్యార్థులు డ్యాన్స్, స్కిట్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టు కున్నాయి. ఈ మహోత్సవం లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శివనామ స్మరణలో తేలియాడారు. ఈ కొత్తపల్లె గ్రామానికి చెందిన ముచ్చుమర్రి ఓబుల రెడ్డి కార్యక్రమాల ను దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థు లు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి : మంత్రి

**రాయచోటి ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**

రాష్ట్రంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణంలో మాండవ్యనది ఒడ్డున వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా మూడోరోజు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం మధ్యాహ్నం పట్టణంలోని చెక్ పోస్ట్ దగ్గర వెలసిన శివాలయం నందు శివరాత్రి పండుగను పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన శివాలయంకు విచ్చేసిన భక్తులకు ప్రజలకు టిడిపి సీనియర్ నాయకులు మడితాటి శ్రీనివాసులు రెడ్డి మరియు రంజిత్ రాయల్ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో శివరాత్రి పండుగను జరుపుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు ప్రజలు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో శివరాత్రి పండుగ

**సదుం ఫిబ్రవరి 15 ప్రభాతవార్త**



శివరాత్రి పండుగను ఆదివారం మండలంలోని పలు శైవ క్షేత్రాలలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నడిగడ్డ మతుకువారిపల్లి వద్దనున్న శ్రీ పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో, రేగలు రోడ్ ఉన్న శ్రీ సుబ్ర హ్మణ్య స్వామి ఆలయ పరిధిలో ఉన్న మరకత శివ లింగం ఆలయంలో నూ, ఎర్రతివారిపల్లె భాస్కర్ రెడ్డి కాలనీలో ఉన్న శ్రీ శ్రీ కన్నె మూల వినాయక దేవస్థానం లోనూ, బూరగుమంద పంచాయతీ మరవపల్లెలోని శ్రీ శివకోన సిద్దేశ్వర స్వామి దేవాలయంలోనూ, దిగువ జాండపేటలోని శ్రీ ప్రసన్న పార్వతీ సమేత అరుణాచలేశ్వర స్వామి దేవస్థానం లో, అదేవిధంగా ఊటుపల్లి పంచాయతీ ఉన్న దేవలం బోర్డులోని మల్లికార్జున స్వామి ఆలయంలోనూ, చెరుకువారిపల్లె శివాలయంలోనూ పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానాలు నిర్వహించారు రాత్రి పలుచోట్ల జాగరణ కార్యక్రమాలు చేశారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి, మండ ల వైస్ ఎంపీపీ అమరావతి పుట్రాజ్, బోరగమంద ఎంపీటీసీ మల్లికార్జున, సర్పంచులు నారాయణరెడ్డి, ఎండపల్లి మనోహర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, వెంకటరెడ్డి, శివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, కర్ణ రామచంద్రయ్య పాల్గొన్నారు.

## పుష్పపల్లకిలో ఊరేగిన శ్రీసల్లాపురమ్మ తల్లి

**కలికిరి, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:**

మండలంలోని పత్తేగడ పంచాయతీ కొటాల గ్రామంలో గ్రామదేవతగా వెలసిన శ్రీసల్లాపురమ్మ అమ్మవారిని ఆదివారం గ్రామంలో పుష్పపల్లకిలో ఊరేగించారు. మహాశివరాత్రి పండగ సందర్భంగా రాష్ట్ర జంగం అభివృద్ధి మరియు కార్పొరేషన్ ఛైర్మన్ వాసనూరి చంద్రశేఖర్, ఆలయ ధర్మకర్త వాసనూరి చల్లయ్య ఆధ్వర్యంలో అమ్మవారిని గ్రామంలో పుష్పపల్లకిలో ఊరేగించారు. దీంతో మహిళలు, భక్తులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. గ్రామంలో వెలసిన అక్కగార్ల అమ్మవారికి ఛైర్మన్ వాసనూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి.



అమ్మవారి ఊరేగింపు దృశ్యం